## శ్రీవారి దర్శనానికి ఎంత సమయమంటే?



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఏపీలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ లోని 31 కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. ఇక టోకెన్లు భక్తులకు శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. నిన్న 80,613 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,403 మంది తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు వచ్చిందని టీటీడీ తెలిపింది.

## ఇంద్రకీలాద్రిపై మొదటి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** ఏపీలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటిరోజున శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బెజవాడ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తోంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు పూర్ణఫలం అందించే అలంకారం బాలా త్రిపుర సుందరీదేవి. ఈ తల్లిని ఆరాధిస్తే మనోవికారాలు తొలగిపోతాయనీ, సర్వ సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. అయితే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసింది.

## రేపు తిరుమలకు చంద్రబాబు



విశాఖపట్నం జిల్లా **(నేటి శుభోదయ):** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం జరిగే ధ్వజారోహణంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టు వస్త్రాలును సీఎం సమర్పించ నున్నారు. ఉండవల్లి నుంచి శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్లో బయలుదేరి విజయవాడ లోని విమానాశ్రయం చేసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10గంటలకు తిరుపతి చేరుకుంటారు. రాత్రి 7.40 గంటలకు బేడి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం ప్రభుత్వం తరపున చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తారు.

# నేటి నుంచి టెట్

**గంటన్నర ముందే పరీక్షా కేంద్రంలోకి అనుమతి**

**నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) జరుగనున్నాయి.**

**ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగనున్నాయి.**




**ఉదయం 9:30 నుంచి 12 వరకు,**

విశాఖపట్నం జిల్లా**(నేటి శుభోదయ):** మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షా సమయానికి గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మొత్తం 108 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు అదనంగా 50 నిముషాల సమయాన్ని కేటాయించారు. మొత్తం 813 మంది దివ్యాంగులు సహాయకులను ఏర్పాటు చేసుకున్నారు. పరీక్షా కేంద్రాలలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఏపీ టెట్ హాల్ టికెట్ డౌన్లోడ్ లింక్ https://aptet.apcfss.in/CandidateLogin.do

## సన్న వడ్లకు 500 బోనస్.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్: తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సన్నవడ్లకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని వ్యవసాయ అధికారులను సీఎం ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్.. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేల ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట కొత్త ఐకేపీ సెంటర్లు కూడా పెట్టాలి. సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలి. ఐకేపీ సెంటర్లకి సీరియల్ నెంబర్లు ఇవ్వాలి. సన్నవడ్లపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి. ధాన్యం కోసం గోనె సంచులు అందుబాటులో ఉండాలి. ధాన్యం కొనుగోలులో వ్యవసాయ అధికారులు భాగం కావాలి. కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలి. ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు ప్రతీరోజూ రెండు గంటల పాటు ధాన్యం కొనుగోలుపైన సమీక్ష జరపాలి. ధాన్యం కొనుగోళ్లపైన కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే. ధాన్యంలో తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసేవారిని సహించవద్దు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. రాష్ట్రంలో వంద శాతం రైతులు సన్నబియ్యం పండించేలా చొరవ చూపించాలి. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో కొనుగోళ్లు ఏర్పాట్లు చేయాలి అంటూ అధికారులను ఆదేశించారు.

# ప్రమాదంలో ప్రపంచం



వరస సంక్షోభాలతో నిరంతరం నెత్తురోడే పశ్చిమాసియా అందరూ చూస్తుండగానే పూర్తి స్థాయి యుద్ధంలోకి జారుకున్నట్టు కనబడుతోంది. ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్, మరో ప్రధాన నగరం జెరూసలేంలపై మంగళవారం రాత్రి ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడటం, ఆ వెంటనే హెజ్బొల్లా మిలిటెంట్లు టెల్‌అవీవ్‌లోని మొసాద్ ప్రధాన కార్యాలయంపై క్షిపణులతో దాడిచేయటం...ఇజ్రాయెల్‌కు దన్నుగా తాము సైతం రంగంలోకి దిగుతామని అమెరికా హెచ్చరించటం పరిస్థితులు వికటిస్తున్నాయన్న సంకేతాలిస్తున్నాయి. ఇరాన్–ఇజ్రాయెల్ నేరుగా తలపడటం ఇక లాంఛనం. ఒకపక్క తన కవ్వింపు చర్యలే ఇరాన్‌ను ప్రతీకారదాడికి పురిగొల్పాయని బట్టబయలైనా ఇరాన్ దాడిని వ్యతిరేకించలేదన్న కారణంతో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌ను 'అవాంఛిత వ్యక్తి'గా ప్రకటించి, తమ దేశంలో అడుగుపెట్టనీయబోమని నిషేధం విధించటం ఇజ్రాయెల్ తెంపరితనానికి నిదర్శనం. శరపరంపరగా వచ్చిపడుతున్న క్షిపణులను పూర్తిగా నిరోధించటం ఇజ్రాయెల్ గర్వంగా చెప్పుకునే రక్షణ ఛత్రం ఐరన్ డోమ్ వల్ల కూడా కాలేదంటే ఇరాన్ దాడి తీవ్రత ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. ప్రాణనష్టం పెద్దగా లేకపోయినా భారీ భవనాలు నేలమట్టం కావటం, పౌరులు కకావికలై పరుగులు తీయటం, ప్రభుత్వాదేశాలతో పది లక్షలమంది ప్రజలు బంకర్లలో తలదాచుకోవటం ఇటీవలికాలంలో ఇదే మొదటిసారి. గాజాలో తన లక్ష్యం పూర్తిచేయగలిగానని భావిస్తున్న ఇజ్రాయెల్... రెండురోజుల క్రితం లెబనాన్‌పై పంజా విసరడం ప్రారంభించింది. హెజ్బొల్లా నేత నస్రల్లాను హతమార్చింది. ఆ సమయానికి ఆయనతో పాటున్న తమ రెవల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరుషాన్ సైతం ప్రాణాలు కోల్పోవటం ఇరాన్ జీర్ణించుకోలేకపోతోంది. అందుకే అది తాజా దాడికి దిగింది. నిజానికి ఇరాన్‌ను ఏనాడూ ఇజ్రాయెల్ ప్రశాంతంగా ఉండనీయలేదు. అది అణ్వాయుధ దేశంగా మారవచ్చునన్న భీతితో గూఢచర్యం సాగిస్తూ పేరెన్నికగన్న శాస్త్రవేత్తలను... ప్రభుత్వంలో, సైన్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని హతమార్చటం ఇజ్రాయెల్ ఒక విధానంగా పెట్టుకుంది. మొన్న ఏప్రిల్‌లో సిరియాలోని డమాస్కస్‌లో ఇజ్రాయెల్ సాగించిన దాడిలో ఇరాన్‌కు చెందిన సైనిక నిపుణుడు, దౌత్యవేత్త మరణించారు. జూలైలో హెజ్బొల్లా నాయకుడు ఇస్మాయెల్ హనియేను ఇరాన్‌లో ఉండగా ఇజ్రాయెల్ హతమార్చింది. ఇలాంటి ఉదంతాలు జరిగిన ప్రతిసారీ డ్రోన్‌లతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగినా వాటివల్ల ఏనాడూ ఇజ్రాయెల్ పెద్దగా నష్టపోలేదు. ఇరాన్ దాడి అనంతరం అంతర్జాతీయ మార్కెట్‌లో బుధవారం ముడి చమురు ధర భగ్గున మండిన తీరు సమీప భవిష్యత్తులో ముంచుకురాబోతున్న ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తోంది. ఇజ్రా యెల్ దాదాపు ఏడాదికాలంగా అన్ని రకాల వినతులనూ బేఖాతరు చేసి గాజా, వెస్ట్‌బ్యాంక్‌లలో సాగిస్తున్న నరమేధం తొలుత పశ్చిమాసియానూ, ఆ తర్వాత ప్రపంచాన్నీ యుద్ధం అంచుల్లోకి నెడుతున్నదని విశ్లేషకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. నిరుడు అక్టోబర్ మొదటివారంలో ఇజ్రాయెల్ భూభాగంలోకి హమాస్ మిలిటెంట్లు చొరబడి 1,200 మంది పౌరులను హతమార్చి, మరో 695 మందిని అపహరించుకుపోవటం ద్వారా హమాస్ దుస్సాహసానికి పాల్పడింది. ఇది ఉగ్రవాద చర్యగా ప్రకటించిన దేశాలు సైతం అనంతర ఇజ్రాయెల్ దాడులను అంగీకరించలేదు. ఐక్యరాజ్య సమితి ఖండించింది. అమెరికా కూడా గాజా నరమేధం విరమించుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరిన మాట వాస్తవం. అలాగని అది ఏనాడూ ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా ఆపలేదు. ఫలితంగా ఇంతవరకూ దాదాపు 45,000 మంది గాజా పౌరులు మరణించారని అంటున్నారు. ఒకసారంటూ యుద్ధం మొదలైతే దాని గమనం, ముగింపు ఎవరి చేతుల్లోనూ ఉండవు. దాని తోవ అది వెదుక్కుంటుంది. రెండో ప్రపంచ యుద్ధ పర్యవసానాలు చూశాక మళ్లీ ఆ ఉత్పాతం జరగనీయరాదని ప్రపంచ దేశాలు ప్రతినబూనాయి. ఎందుకంటే ఆ యుద్ధంలో అయిదున్నర కోట్ల మంది సాధారణ పౌరులు, మరో రెండున్నరకోట్లమంది సైనికులు మరణించారు. కోట్లాదిమంది క్షతగాత్రులయ్యారు. ఒక్క సోవియెట్ యూనియన్‌లోనే దాదాపు రెండున్నర కోట్లమంది మరణించారు. మరో 90 లక్షలమంది వరకూ వ్యాధుల బారినపడ్డారు. కానీ విస్తరణ కాంక్షతో తహతహ లాడే అగ్రరాజ్యాలు తమ ట్కర్పీ జం వదులుకోలేదు. ఆ వెనువెంటనే తమకు అలవాటైన యుద్ధ క్రీడ ప్రారంభించాయి. వర్తమాన పరిణామాలు దాని పర్యవసానమే. న్యూయార్క్ టైమ్స్ పరిశోధక పాత్రికేయురాలు అనీ జాకబ్‌సన్ యుద్ధం వల్ల మానవాళికి కలగబోయే హాని గురించి చెప్పిన అంశాలైనా అగ్రరాజ్యాల కళ్లు తెరిపించాలి. అణ్వాయుధ యుద్ధం కేవలం 72 నిమిషాల్లో భూగోళంపై 60 శాతం జనాభాను తుడిచిపెడుతుందని హెచ్చరించారామె. ఇజ్రాయెల్‌కు అమెరికా అండదండలున్నట్టే ఇరాన్‌కు రష్యా, చైనాల ఆశీస్సులున్నాయి. దానికి హమాస్, హిజ్బొల్లా గ్రూపులు, యెమెన్‌లోని హౌతీలు, ఇరాక్, సిరియాల్లోని షియా మిలిటెంటు సంస్థలూ మరింత దగ్గరవుతాయి. ఇజ్రాయెల్‌తో సాన్నిహిత్యం నెరపుతున్న ఈజిప్టు, జోర్డాన్‌లకూ, ఆ తోవనే వెళ్తున్న సౌదీ అరేబియాకూ సంకటస్థితి ఏర్పడుతుంది. ఈ వైరిపక్షాలన్నీ కొంత హెచ్చు తగ్గులతో ప్రపంచాన్ని సర్వనాశనం చేయగల మారణాయుధాలతో సంసిద్ధంగా ఉన్నాయి. అందుకే పాలస్తీనా ఆవిర్భావానికి సహకరించటం, దుందుడుకు విధానాలకు స్వస్తిపలకడం వంటి చర్యలే పశ్చిమాసియాకూ... మొత్తం ప్రపంచానికీ ప్రశాంతతనిస్తాయని ఇజ్రాయెల్ గుర్తించాలి. అమెరికా వివేకంతో మెలిగి సామరస్య ధోరణులకు తోడ్పాటునందించాలి.

## టి.డబ్ల్యూ. జె.ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామ చేసిన జర్నలిస్ట్ కళ్యాణ్. సి.ఎమ్

కూకట్ పల్లి : నేటి శుభోదయ (సాధనాల వీరేంద్ర) అక్టోబర్ 03, 2024 తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి జర్నలిస్ట్ మండపాక కళ్యాణ్ చక్రవర్తి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక టీయూడబ్ల్యూజే (143) నందు సుదీర్ఘకాలం పనిచేసి జర్నలిస్టుల సమస్యలపై పోరాటం చేశారు. జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో మేలు జరగడంలేదని భావించి నాడు రాజీనామా చేశారు. ఆ తర్వాత తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆయనను గుర్తించి యూనియన్ లోకి ఆహ్వానించారు. జర్నలిస్టులకు మేలు చేసే క్రమంలో ఆ యూనియన్ తో కలిసి పని చేయడానికి ముందుకు నడిచారు. కూకట్పల్లి నియోజకవర్గంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏర్పాటులో కీలక పాత్ర వహించారు. కూకట్పల్లి నియోజకవర్గంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నందు ప్రధాన కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆ తర్వాత మేడ్చల్ జిల్లా లో ట్రెజరర్ గా పని చేశారు, ఆ తర్వాత జరిగిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రెండో మహాసభల్లో ఆయన




కార్యదర్శి పదవికి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన్ని వరించిన ప్రతి పదవికి వన్నె తెచ్చే విధంగా ముందుకు నడిచారు, జర్నలిస్టుల సంక్షేమం పరమావధిగా పనిచేశారు. కరోనా సమయంలో తోటి జర్నలిస్టులతో కలిసి కూకట్పల్లి నియోజకవర్గం నందు కరోనా వచ్చి ఇబ్బంది పడ్డ జర్నలిస్టులకు యూనియన్లకు అతీతంగా పలు రకాలుగా సహాయపడ్డారు. నిత్యం జర్నలిస్టులకు పూర్తి ఫలితాలు క్రింది స్థాయి వరకు అందాలని ఆయన ఆకాంక్ష కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పదవికి రాజీనామా చేయడం ఆసక్తికరంగా మారింది. త్వరలో భవిష్యత్ ప్రణాళిక ప్రకటిస్తానని మీడియాకు తెలిపారు.

# పంటల బీమాలో 'ప్రైవేటు'తో ప్రయోజనం లేదు!



అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఒక సమగ్ర పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని చెప్పింది. ఈ హామీ అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో కూడిన పంటల బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని నిర్ణయించింది. అంతేకాకుండా భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా పంటల బీమా పథకానికి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటాను కూడా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. రైతు మీద ఎలాంటి ఆర్థిక భారం లేకుండా అన్ని పంటలను పూర్తిస్థాయిలో సమగ్ర పంటల బీమా పథకం కింద తీసుకొచ్చి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జరిగే నష్టానికి పరిహారాన్ని చెల్లించి రైతులలో ఆత్మస్థైర్యాన్ని నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. గతంలో అమలు చేసిన వివిధ పంట బీమా పథకాలను మూడు దశలుగా విశ్లేషిద్దాం. మొదటి దశ (1985-2000). 1972లో మొదటిసారి గుజరాత్ రాష్ట్రంలో పత్తి పంటతో మొదలైన పంటల బీమా పథకం ప్రయోగాత్మకంగా పరిమితంగా కొన్ని రాష్ట్రాల్లో అమలు చేసిన తర్వాత పూర్తిస్థాయి పంటల బీమా పథకం 1985లో మొదలైంది. ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ ముందు చూపుతో సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకువచ్చి 16 ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలకు విస్తరింపజేసి అన్ని ప్రధాన పంటలకు వర్తింపచేశారు. ఈ పథకాన్ని ప్రభుత్వ రంగంలోని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేశారు. ఈ కాలంలో సుమారు ఏడు కోట్ల 63 లక్షల మంది రైతులు పంటల బీమా పరిధిలోకి రావడంతో పాటు సుమారుగా రూ.2,319 కోట్ల నష్టపరిహారాన్ని పొందారు. అయితే మొత్తం బీమా సంస్థకు చెల్లించిన ఇన్సూరెన్స్ ప్రీమియం కేవలం రూ.400 కోట్లు మాత్రమే. అనగా రైతులు, రైతుల తరఫున ప్రభుత్వం చెల్లించిన మొత్తం ప్రీమియం కంటే వచ్చిన నష్టపరిహారం సుమారుగా ఐదు రెట్లు ఎక్కువ. రెండవ దశ (2001-2015). పంటల బీమా పరిధిని మరింత విస్తరించి జాతీయ వ్యవసాయ బీమా పథకం 2001లో భారతదేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన పంటలకు విస్తరింప చేశారు. ఈ దశలోనే పంటల బీమా అమలు ప్రాముఖ్యతను గుర్తించి 'భారత వ్యవసాయ బీమా కంపెనీ' (అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా) అనే స్వతంత్ర సంస్థను 2002లో ఏర్పాటు చేసి ఈ సంస్థ ద్వారా ఈ జాతీయ పంటల బీమా పథకాన్ని 2015 వరకు అమలు చేశారు. అయితే, ఈ దశలోనే 2010-11 ప్రాంతంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీతో పాటు ప్రైవేట్ సంస్థలను కూడా పంటల బీమా రంగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగాత్మకంగా రెండు సంవత్సరాలు (2011-12, 2012-13) కొన్ని రాష్ట్రాల్లో కొన్ని పంటలకు సవరించిన పంటల బీమా పథకాన్ని అమలు చేశాక, ఈ పథకం ద్వారా రైతులకు ప్రయోజనం లేదని భావించి 2013లో నిలిపివేశారు. ఎందుకంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలైన సవరించిన పంటల బీమా పథకం ద్వారా చెల్లించిన నష్టపరిహారం కేవలం రూ.237కోట్లు మాత్రమే, కానీ సేకరించిన ప్రీమియం దాదాపు రూ.825కోట్లు. మరోవైపు భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేసిన జాతీయ వ్యవసాయ బీమా పథకం కింద ఇదే కాలంలో సేకరించిన ప్రీమియం రూ.7,565 కోట్లు అయితే రైతులకు చెల్లించిన నష్టపరిహారం రూ.25,000 కోట్లు. మూడవ దశ (2016 నుండి నేటి వరకు). కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చాక 2016లో ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని భారీ అంచనాలతో తీసుకువచ్చారు. ఈ పథకం అమలులో పంట బీమా రంగంలోకి ప్రైవేటు సంస్థలకు గేట్లు తెరిచారు. అంతేకాకుండా బీమా సంస్థలకు చెల్లించే ప్రీమియాన్ని గతంలో అమలు చేసిన పంట బీమా పథకాలతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు పెంచారు. దీని ఫలితంగా ఎన్నో ప్రైవేట్ సంస్థలు పంటల బీమా రంగంలోకి పుట్టగొడుగుల్లాగా పుట్టుకొచ్చాయి. ఇటీవల ఒక నివేదికలో 2020-23 మధ్య కాలంలో భారతదేశంలో మొత్తం ప్రీమియం రూపంలో సుమారు రూ.28,000 కోట్లు వివిధ బీమా సంస్థలకు చెల్లించినట్లు, అదే కాలంలో కేవలం రూ.8000 కోట్లు మాత్రమే ఈ బీమా సంస్థలు రైతులకు నష్టపరిహారం రూపంలో తిరిగి చెల్లించినట్లుగా తెలుస్తుంది. దీన్నిబట్టి పంటల బీమా రంగంలోని ప్రైవేట్ సంస్థలు ఏ విధంగా లాభాలు ఆశిస్తున్నాయో అర్థం అవుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ పథకాన్ని 2019 వరకు నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో అమలు చేసింది. ఒకవైపు రైతుల వాటా మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం వాటాల కింద ప్రీమియం రూపంలో ఈ ప్రైవేట్ సంస్థలకు వేల కోట్లు ధారాదత్తం చేయబడ్డాయి. ఇదే కాలంలో, తెలంగాణలోని రైతాంగానికి ఏ ప్రైవేట్ సంస్థ కూడా ఎలాంటి పంట నష్టపరిహారం ఆశించినట్టుగా చెల్లించలేదు. దీనిని నెపంగా చూపించి ప్రత్యామ్నాయ పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టకుండా నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నుంచి పంటల బీమా పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన పంటల బీమా పథకానికి ఈ అనుభవాలను ఒక గీటురాయిగా పరిగణించాలి. ప్రస్తుత వానాకాలంలో వరి పంట సుమారు 50 లక్షల ఎకరాలు, పత్తి 42 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5 లక్షల ఎకరాలు, మిరప లక్ష ఎకరాలలో సాగు చేస్తున్నట్టుగా అంచనాలు వస్తున్నాయి. దీని ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన నూతన పంటల బీమా పథకానికి రైతుల వాటా కింద సుమారు రూ.1600కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద మరో రూ.2000కోట్లు- మొత్తం సుమారు రూ.3600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బీమా సంస్థలకి ప్రీమియం రూపంలో ప్రతి ఏటా చెల్లించాలి. అదేవిధంగా ఒకవేళ కేంద్రం రూపొందించిన ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధంగా అమలు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వం వాటా కింద మరో రూ.2000కోట్లు బీమా సంస్థలకు నేరుగా చెల్లించాలి. అనగా తెలంగాణలో రైతాంగాన్ని పూరిస్థాయిలో పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలంటే సుమారుగా రూ.5,600కోట్లు మొత్తం ప్రీమియం రూపంలో బీమా సంస్థలకు చెల్లించాలి. అయితే ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని యథావిధిగా అమలు చేసి ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా పొందాలంటే ప్రైవేట్ రంగ సంస్థలను విధిగా భాగస్వామ్యం చేయాలి. టెండర్ విధానం ద్వారా బీమా సంస్థలను ఎంపిక చేయాలి. ఇదే జరిగితే ప్రైవేట్ సంస్థలు సాధ్యమైనంత వరకు తక్కువ ప్రీమియంతో టెండర్ దక్కించుకొని పంటల బీమా పథక ప్రయోజనాలను రైతాంగానికి దక్కకుండా వివిధ అనైతిక పద్ధతులు, షరతులతో రైతాంగాన్ని నట్టేట ముంచే ప్రమాదం ఉంది. గతంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అమలైన పంటల బీమా పథకాలు చెబుతున్న అనుభవాలు కూడా ఇవే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పంటల బీమా పథకం ద్వారా రైతులకు నిజంగా ప్రయోజనం జరగాలంటే ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించి రాష్ట్ర ప్రభుత్వం తనదైన ప్రత్యేక ముద్రతో ఈ పథకాన్ని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలు చేయాలి. ఒకవేళ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా పంటల బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటే కేంద్ర ప్రభుత్వం ప్రీమియంలోని తన వాటాను ఈ ప్రభుత్వ రంగ బీమా సంస్థకు చెల్లించదు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా, రైతుల వాటాతో కూడిన ప్రీమియంతో (సుమారు రూ.3600 కోట్లతో) ఎలాంటి టెండర్ విధానం అవసరం లేకుండా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ భాగస్వామ్యంతో రైతులకు మరింత ప్రయోజనం కలిగించే విధంగా పంటల బీమా పథకం అమలు చేసే అవకాశం ఉంది. ఒకవేళ నష్టపరిహారం కనుక రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే మొత్తం ప్రీమియం కంటే తక్కువ ఉన్నట్టయితే, ఆ మిగులు ప్రీమియంలో (కంపెనీ లాభం) సింహభాగాన్ని తిరిగి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే అవకాశం కూడా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా విధివిధానాలను రూపొందించి ప్రయోజనాత్మకమైన ప్రత్యామ్నాయ పంటల బీమా పథకాన్ని తీసుకొస్తుందని ఆశిద్దాం.